సాక్షి
రంగారెడ్డి
సోమవారం ౹ 12 ౹ మే ౹ 2025



మాట మార్చి!
ఉగ్రవాదం, గూఢచర్యం, వీరికి సహాయ సహకారాల కోసం పాకిస్తాన్ తన దేశీయుల్ని భారత్‌లోకి పంపిస్తూనే ఉంటుంది. 8లో ▸



గుప్త నిధుల కోసం..
గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన సంఘటన వేములనర్వ శివారులో చోటుచేసుకుంది. 8లో ▸



కారులో మంటలు
రహదారిపై వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని దగ్ధమైంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. 8లో ▸

న్యూస్‌రీల్

నేటి నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

మహేశ్వరం: మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ జె.శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం రెండో విడతలో భాగంగా మహేశ్వరంతో పాటు ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం ద్వారా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చిందన్నారు. స్లాట్ బుకింగ్‌తో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తవేజుల నమోదు కోసం గంటల తరబడి నిరీక్షించే అవసరం ఉండదని తెలిపారు. 10 నుంచి 15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందన్నారు. దస్తవేజుల రిజిస్ట్రేషన్ కోసం అనుకున్న సమయానికి, తేదీకి, ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తర్వాత 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని వివరించారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని వెళ్లిపోవచ్చన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారి జయంతి, కల్యాణోత్సవాలను పురస్కరించుకొని రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి జరిగిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

ఎప్‌సెట్‌లో సత్తా

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) టాప్‌టెన్‌లో నగర విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎనిమిది ర్యాంకులు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఏడు ర్యాంకులు దక్కించుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే లభించగా, అందులో రెండు మినహా 8 ర్యాంకులు మనవాళ్లే సాధించారు. మిగిలిన ఇద్దరు ర్యాంకర్లు కూడా హైదరాబాద్‌లోని కళాశాలలో చదివి టాప్‌టెన్‌లో నిలిచారు. ఇక అగ్రికల్చర్, ఫార్మసీ టాప్‌టెన్‌లో తొమ్మిది మంది బాలురు, ఒక బాలికకు ర్యాంకులు దక్కాయి. మొత్తం పది ర్యాంకుల్లో మూడు ర్యాంకులు మినహా మిగిలిన ఏడు ర్యాంకులు హైదరాబాదీలే దక్కించుకున్నారు.

ర్యాంకులు ఇలా..

ఇంజినీరింగ్ విభాగంలో శేరిలింగంపల్లికి చెందిన ఉడగండ్ల రామ్‌చరణ్ రెడ్డికి రెండో ర్యాంకు, నాచారానికి చెందిన మెండె లక్ష్మి భార్గవ్‌కు నాలుగో ర్యాంకు లభించాయి. మాదాపూర్‌లోని మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్‌కు ఐదో ర్యాంకు, సుంకర సాయి రిశాంత్ రెడ్డికి ఆరో ర్యాంకు, కాకతీయ హిల్స్‌కు చెందిన రష్మిత్ బండారి ఏడో ర్యాంకు, బండగ్‌పేటకు చెందిన బనిబ్రత మజీకి ఎనిమిదో ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన కొత్త ధనుష్ రెడ్డికి తొమ్మిదో ర్యాంకు, మేడ్చల్‌కు చెందిన కొమ్మ కార్తీక్‌కు పదో ర్యాంకు దక్కాయి.

అగ్రికల్చర్, ఫార్మాలోనూ..

అగ్రికల్చర్, ఫార్మా ఫలితాల్లో మేడ్చల్‌కు చెందిన సాకేత్ రెడ్డి మొదటి ర్యాంకు సాధించాడు. మాదాపూర్‌కు చెందిన బ్రాహ్మణి ఐదో ర్యాంకు, కూకట్‌పల్లికి చెందిన గుమ్మడిదల తేజస్ ఆరో ర్యాంకు, నిజాంపేటకు చెందిన కొలను అభిరానంద రెడ్డి ఏడో ర్యాంకు, సరూర్‌నగర్‌కు చెందిన భానుప్రకాశ్ రెడ్డి ఎనిమిదో ర్యాంకు, హైదర్‌గూడకు చెందిన అర్జా శామ్యూల్ సాత్విక్ తొమ్మిదో ర్యాంకు, బాలాపూర్‌కు చెందిన అద్దుల శశికరణ్ రెడ్డి పదో ర్యాంకు సాధించారు.

భారత్‌కు వ్యతిరేకంగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు

యువకుడిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్: ఇన్‌స్టాగ్రామ్‌లో దేశానికి వ్యతిరేకంగా పోస్టు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పాల్మాకులకు చెందిన సయ్యద్ ఇక్రముద్దీన్ (25)తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పాకిస్తాన్‌కు మద్దతు తెలుపుతూ మన దేశానికి వ్యతిరేకంగా పోస్టు చేశాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సదరు యువకుడి వర్గీయులు ఆదివారం శంషాబాద్ ఠాణాకు రావడంతో.. మరో వర్గం వారు కూడా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిఫార్సులకే పెద్దపీట!

ఇందిరమ్మ ఇళ్లలో ఇష్టారాజ్యం
- దరఖాస్తులు, సర్వేలు.. అన్నింటికీ తూట్లు
- నిబంధనలకు విరుద్ధంగా జాబితాలు
- నేతల అనుచరులకే అందలం
- నెరవేరని పేదల సొంతింటి కల



ఇబ్రహీంపట్నంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పారదర్శకంగా జరగాల్సిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక పూర్తిగా రాజకీయ కోణంలో జరిగినట్లు.. సిఫార్సులకే పెద్దపీట వేసినట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారుల క్షేత్రస్థాయి సర్వేకు భిన్నంగా అర్హుల జాబితా రూపొందినట్లు ఆరోపణలు లేకపోలేదు. మొదటి విడత పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొంత వరకు అర్హులకే ఇళ్లు దక్కినప్పటికీ.. రెండో విడత జాబితా తయారీ పూర్తిగా ఎమ్మెల్యే, వారి అనుచరుల కనుసన్నల్లో పూర్తయింది. ఇందిరమ్మ కమిటీలు సిఫార్సు చేసిన కార్యకర్తలు/ఓటర్లకే ఇళ్లను కట్టబెట్టినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులకు బదులు అనర్హులు వచ్చి చేరినట్లు సమాచారం. విషయం అధికారులకు తెలిసీ ఏమీ చేయలేక..వారు సూచించిన పేర్లను లబ్ధిదారుల జాబితాలో చేర్చుతున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా పేదల సొంతింటి కల నెరవేరకుండా పోతోంది.

రాజకీయ జోక్యంతో..

ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 80.54 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కులగణన/ఇంటింటి సర్వేలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదనే ఉద్దేశంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, జియో ట్యాగింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఎంపిక చేసిన బృందాలు దరఖాస్తు దారుని ఇంటికి చేరుకుని వివరాలు సేకరించాయి. ఒక కుటుంబానికి ఒకే ఇల్లు కేటాయించేలా జాబితా రూపొందించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను తొలుత ఎంపీడీఓలు/మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో ఉంచారు. గ్రామ సభలు/వార్డు సభల్లో ఆయా లబ్ధిదారుల జాబితాను చదివి విన్పించారు. తీరా తుదిజాబితా రూపకల్పనలో రాజకీయ పైరవీకారులకే పెద్దపీట వేసినట్లు తెలిసింది. తొలి విడతలో 15 వేల ఇళ్లు మంజూరు కాగా, వీరిలో ఇప్పటికే ఏడు వేల మందిని ఎంపిక చేసి, వారికి ధ్రువీకరణ పత్రాలు సైతం జారీ చేశారు. మిగిలిన వారికి మరో రెండు మూడు రోజుల్లో అందజేయాల్సి ఉంది. పారదర్శకంగా, నిజాయితీగా పేదలకు దక్కాల్సిన ఇళ్లు రాజకీయ జోక్యంతో పార్టీ నాయకులు తన్నుకుపోతున్నారు. ఎమ్మెల్యే చెప్పిన వారి పేర్లను మాత్రమే జాబితాలో చేర్చుతుండటం.. ఎండీఓ, మున్సిపల్ కమిషనర్లు వాటినే ధ్రువీకరిస్తుండటం.. కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాటికి ఆమోదముద్ర వేస్తుండటం వివాదాస్పదంగా మారుతోంది.

అందని ఆర్థిక సాయం.. పెరిగిన సిమెంట్ ధర

మరోవైపు ఇందిరమ్మ ఇల్లు మంజూరై, సొంత ఖర్చులతో బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఆర్థిక సహకారం అందకపోవడంతో వారు అయోమయంలో పడిపోయారు. ఇప్పటికే చేతిలో ఉన్న సొమ్ము పూర్తిగా ఖర్చు కాగా, కొత్తగా మార్కెట్లో అప్పు పుట్టని పరిస్థితి. అంతేకాదు ఇంటి నిర్మాణం 600 చదరపు అడుగుల విస్తీర్ణానికి మించకూడదనే నిబంధనకు తోడు ఇటీవల పెరిగిన సిమెంట్, కూలీ ధరలు కూడా లబ్ధిదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఏప్రిల్ నెలాఖరు వరకు సిమెంట్ బస్తా రూ.290 నుంచి రూ.300 వరకు ఉండగా, ప్రస్తుతం ఒక్కో బస్తా ధర (కంపెనీని బట్టి) రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగింది. పెరిగిన ధరలు భారంగా మారనుండటంతో మెజార్టీ లబ్ధిదారులు పిల్లరు గుంతలు, బేస్‌మెంట్ దశలోనే నిర్మాణాలను నిలిపివేయడం గమనార్హం. ఇదిలా ఉంటే కొంత మంది మధ్యవర్తులు కొత్తగా ఇళ్లు కట్టుకోవాలని భావించే ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని సాధారణ మధ్య తరగతి ప్రజలకు ఇళ్లు మంజూరు చేయిస్తామని ఆశ చూపించి, వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తులు

మొత్తం దరఖాస్తులు:	80.54 లక్షలు
అధికారులు పరిశీలించినవి:	71.51 లక్షలు
ఖాళీ స్థలాలు ఉన్నవారు:	40.86 లక్షలు
అర్హత సాధించిన లబ్ధిదారులు:	18.32 లక్షలు
జిల్లాకు మంజూరైన మొత్తం ఇళ్లు:	24,000
తొలి విడతలో మంజూరైనవి:	15,000

సర్వేలో భాగంగా గుర్తించిన తాత్కాలిక ఇళ్లు

నివాసాలు	లక్షల్లో
తాటి ఆకులు/ గడ్డితో ఏర్పాటు చేసినవి	0.66
సగం కూలిపోయి, టార్పాలిన్‌తో కప్పినవి	0.95
మట్టిగోడలతో కూడిన సిమెంట్ రేకులవి	2.69
మట్టిగోడలు జీఐ షీట్స్‌తో కూడినవి	2.43
మట్టిగోడలతో కూడిన పెంకుటిళ్లు	2.59
సిమెంట్ ఇటుకలు టార్పాలిన్ కవర్లు	0.33
టైల్డ్ రూఫ్స్ విత్ బ్రిక్స్‌వాల్స్	2.08
సిమెంట్ ఇటుకలు/రేకులు	2.04
సిమెంట్ ఇటుకలు/జీఐ షీట్స్	2.25
మట్టితో కూడిన మిద్దె ఇళ్లు	1.75
ఆర్‌సీసీ రూఫ్ రెంట్ ఇళ్లు	0.55



ఠానునాయక్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సబితారెడ్డి, బంజారా నాయకులు

పోరాటయోధుడు ఠానునాయక్

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం పోరాడిన గొప్పయోధుడు ఠానునాయక్ అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జటోత్ ఠానునాయక్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఠానునాయక్ చరిత్రను, పోరాట స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజనుల అభివృద్ధికి తన వంతు పాత్ర పోషిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రవీంద్‌ర్‌నాయక్, స్థానిక బంజారా నాయకులు జటావత్ శ్రీనివాస్ నాయక్, హామునాయక్, రవీందర్‌నాయక్, సికిందర్‌నాయక్, డా.లక్ష్మణ్‌నాయక్, దేవానంద్ నాయక్, దీప్‌లాల్ నాయక్, బాలునాయక్, లక్ష్మణ్‌నాయక్, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీజేపీ నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, అనిల్‌యాదవ్, రాజ్‌కుమార్, మాదరి రమేష్, బాలరాజ్, సునీత, రజాక్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: కార్మికులకోసం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం తీసుకు వచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆదివారం చేవెళ్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులపై దాడి మొదలుపెట్టిందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను పెట్టుబడి దారి వర్గానికి కొమ్ము కాస్తూ నాలుగు కోడ్‌లుగా చేసి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి 8 గంటల పని దినాలను సాధించుకున్నారని, కాని మోదీ ప్రభుత్వం 12 గంటల పనిదినాలు తీసుకువస్తోందని మండిపడ్డారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మెను కార్మికులు, కర్షకులు, ప్రజలు, ప్రజాసంఘాలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం పాల్గొన్నారు.



చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కూల్చివేసిన ట్యాంకులను పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు


తినే కూడులో మట్టి పోస్తారా?

- చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చివేయడం దారుణం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: తినే కూడులో మట్టిపోస్తారా.. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలోని హౌస్‌లను కూల్చివేయడం దారుణం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో కూల్చివేసిన హౌస్‌లను(ట్యాంకులు) ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో చేప పిల్లలను ఉత్పత్తి చేసే 9 ట్యాంకులను మత్స్యకార సంఘాలతో చర్చించకుండా ఎందుకు కూల్చివేశారని అధికారులను ప్రశ్నించారు. దీంతో మత్స్యకార కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలోని ట్యాంకులను పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కూల్చడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.సామేల్, ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం అమ్మ

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



గర్భిణులకు న్యూట్రీషియన్, మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కడ్తాల్: అమ్మ రుణం కోటి జన్మలెత్తినా తీర్చలేనిదని, సృష్టికి మూలం అమ్మ అని ఐపీఎస్ మాజీ అధికారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గర్భిణులకు న్యూట్రీషియన్, మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రవీణ్‌కుమార్‌తోపాటు గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మతనం మాటల్లో వర్ణించలేనిదని, అక్షరాల్లో రాయలేనిదని కొనియాడారు. సృష్టిలో తీయని పదం, వెలకట్టలేనిది అమ్మ ప్రేమ అని, మాతృమూర్తి చూపే ప్రేమానురాగాలు మరెవ్వరూ చూపలేరని తెలిపారు. జీవన ప్రయాణంలో అనునిత్యం మనల్ని దీవిస్తూ ముందుకు నడిపించేది ఒక్క అమ్మ ప్రేమేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ కుటుంబసభ్యులు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సిరుల బాట

- బాటసింగారం మార్కెట్ రికార్డు
- లక్ష్యానికి మించిన ఆదాయం
- ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు
- రూ.222 కోట్ల టర్నోవర్
- సమకూరిన ఆదాయం రూ.2.22 కోట్లు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: పండ్లలో రారాజు మామిడి. వేసవి వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరూ మామిడి పండ్ల రుచులను ఆస్వాదించాలనుకుంటారు. వివిధ ప్రాంతాల్లో పండే ప్రత్యేక రకాలు సైతం హైదరాబాద్ మార్కెట్లలో లభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన బాటసింగారం మార్కెట్‌కు మామిడి పండ్ల సీజన్ సిరుల వర్షం కురిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.222 కోట్ల టర్నోవర్‌తో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. స్థానిక మార్కెట్‌లో లభించే 11 రకాల పండ్లు రాష్ట్ర సరిహద్దులు దాటి ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. గ్రేడ్‌ను బట్టి కిలో రూ.70 నుంచి రూ.120 వరకు ధరలు పలుకుతున్నాయి.

ఎటుచూసినా మామిడి రాశులే..

బాటసింగారం పండ్ల మార్కెట్ యార్డులో ఎటు చూసినా నిలువెత్తు మామిడి రాశులు దర్శనమిస్తున్నాయి. వందలాది మంది కార్మికులు నిత్యం పండ్లను గ్రేడింగ్ చేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. మార్కింగ్ చేసిన ట్రేలను లారీల్లో నింపే పనిలో కళాసీలు.. లావాదేవీలు చూసుకునే వర్తకులు, రైతులు ఇలా అక్కడంతా బిజీబిజీగా కనిపిస్తున్నారు. రూ.వందల కోట్ల టర్నోవర్ జరుగుతోంది. లక్షల క్వింటాళ్ల మామిడి పండ్లు ఎగుమతి అవుతున్నాయి. నిత్యం 1,500 వరకు వాహనాలు మామిడి దిగుబడితో వచ్చివెళ్తున్నాయి.

ఈ ఏడాది ఇప్పటి వరకు 7.34 లక్షల క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు, అనంతరపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, మెదక్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మామిడి బాటసింగారం మార్కెట్‌కు వస్తోంది. గ్రేడింగ్ చేసిన సుమారు 70 శాతం పండ్లను రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మిగతా 30 శాతం స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు.

గతంతో పోల్చితే రాష్ట్రంలో మామిడి దిగుబడులు తగ్గినా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే దిగుమతులు ఆ స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో బాటసింగారం మార్కెట్‌కు 6,99,886 క్వింటాళ్ల మామిడి పండ్లు రాగా, ఈ ఏడాది ఈ నెల 10వ తేదీ నాటికి 7,34,154 క్వింటాళ్ల మామిడి వచ్చిందని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సుమారు 64 వేల మంది రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకున్నారు. రూ.222 కోట్ల టర్నోవర్ అయ్యింది. ఇందులో 1 శాతం రుసుము కింద మార్కెట్‌కు రూ.2.22 కోట్ల ఆదాయం సమకూరింది.

రికార్డుస్థాయి విక్రయాలు



ఈ సీజన్‌లో మామిడి పండ్లు అంచనాలకు మించి వస్తున్నాయి. రికార్డు స్థాయిలో అమ్మకాలు ఉంటాయని ఆశిస్తున్నాం. బంగినపల్లి ఇతర రకాలు ఉత్తర భారత దేశంలో మంచి గిరాకీ ఉంది. సుమారు 75 శాతం ఎగుమతి అవుతున్నాయి. మార్కెట్‌కు వచ్చే రైతులు, వర్తకులకు అనువైన వాతావరణం కల్పించాం. రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి ఇదే ఉత్తమమైన మార్కెట్ అని నమ్ముతున్నారు. అనుకున్నట్లుగానే మంచి ధర లభిస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి రైతులు ఇక్కడికి తమ పండ్లను తెస్తున్నారంటేనే ఇక్కడి పరిస్థితులు ఎంత సానుకూలంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మరో నెల రోజుల వరకు పండ్లు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేని గణాంకాలు చూస్తాం.

– చిలుక మధుసూదన్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

సైబర్ ట్రాప్

- లోన్ ఇస్తామంటే ఒకరు.. టెలిగ్రామ్ లింక్‌లో ఇన్వెస్ట్ చేసి మరొకరు..
- రూ.1.10 లక్షలు పోగొట్టుకున్న ఇద్దరు వ్యక్తులు



మొయినాబాద్: మొయినాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు సైబర్ మోసాలకు గురయ్యారు. లోన్ మంజూరు కోసం అంటూ డబ్బులు పంపి ఒకరు.. టెలిగ్రామ్ లింక్‌లో ఇన్వెస్ట్ చేసి మరొకరు మోసపోయి సుమారు రూ.1.10 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ సంఘటనలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ నయీముద్దీన్‌కు ఆదివారం గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయడంతో తాను బజాజ్ ఫైనాన్స్ లోన్ ఎగ్జిక్యూటివ్‌ను అని పరిచయం చేసుకుని.. నీకు రుణం మంజూరైందని.. ఆమోదం కోసం కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దాంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, టీడీఎస్ కోసం ఇంకొంత చెల్లించాలని అడిగాడు. దీంతో అతడు మొత్తం రూ.75,130 పంపించాడు. ఇంకా కొంత డబ్బు పంపాలని డిమాండ్ చేయడంతో మోసం జరిగిందని గ్రహించిన నయీముద్దీన్ మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చూసి..

మొయినాబాద్‌కు చెందిన ఎండీ ఏజాస్ ఆదివారం ఇన్‌స్టాగ్రామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగానికి సంబంధించిన ప్రకటన చూసి ఆ నంబర్‌కి ఫోన్ చేశాడు. ఫోన్‌లో మాట్లాడిన అవతలి వ్యక్తి సూచనల ప్రకారం టెలిగ్రామ్‌లో ఓ లింక్‌లో రూ.34,421 ఇన్వెస్ట్ చేశాడు. ఇన్వెస్ట్ చేసిన డబ్బులు తిరిగి రాకపోవడంతో అది సైబర్ మోసం అని గ్రహించిన ఏజాస్ సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కాడెద్దులు తస్కరణ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు రెండు కాడెద్దులను ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని సోలీపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు కావలి బుచ్చయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తన వ్యవసాయ పొలంలో శనివారం రాత్రి రోజు మాదిరిగానే పశువులకు మేత వేసి ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఆదివారం ఉదయం వెళ్లి పశువుల పాకలో చూడగా రెండు కాడెద్దులు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని వాపోయాడు.

వ్యక్తి అదృశ్యం


ఎండీ నజీర్

అబ్దుల్లాపూర్‌మెట్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేట కు చెందిన ఎండీ నజీర్ (65) సునీల్ అనే వ్యక్తి దగ్గర పెయింటింగ్ పని చేయడానికి వస్తుంటాడు. ఈక్రమంలో శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లో నిర్వహిస్తున్న పెయింటింగ్ పనికి కూలీగా వచ్చాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో దుకాణానికి వెళ్తున్నా అని చెప్పి పని దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి రాలేదు. సునీల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

తప్పిన పెను ప్రమాదం

దుద్యాల్: అదుపుతప్పిన కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటన మండల పరిధిలోని ఈర్లపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన కావలి రాజు, సిద్ధు పని నిమిత్తం నారాయణపేట్ జిల్లా కోస్గి పట్టణానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈర్లపల్లి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం మూడు ముక్కలయింది. కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు?


గుప్త నిధుల కోసం తీసిన గుంత

కేశంపేట: గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని పాత బీరప్ప దేవాయలం సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామం నుంచి అల్వాల వైపు వెళ్లే దారిలో పాత బీరప్ప దేదాలయం సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల క్రితం జేసీబీ సాయంతో గుంతను తీసి పూడ్చివేశారు. ఆదివారం సమీపంలోని రైతులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. గుంత సమీపంలో పూజా సామగ్రితో పాటు నిమ్మకాయలు, గుమ్మడికాయలు కన్పించాయి. ఓ కుండను పగులగొట్టిన ఆనవాళ్లు కన్పించాయి. గతంలో పాత బీరప్ప గుడి సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్టు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ నరహరి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంత తీసి మళ్లీ పూడ్చిన ఆనవాళ్లు ఉన్నట్టు తెలిపారు.

అనుమతి లేకుండా మద్యం వినియోగం


ఎక్సైజ్‌పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

దాడి చేసి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

మొయినాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగిస్తున్న ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఢిల్లీ, గోవా రాష్ట్రాలకు చెందిన రూ.4 లక్షల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తోలుకట్టలో నగరానికి చెందిన తేజా రెడ్డి ఫాంహౌస్ ఉంది. శనివారం రాత్రి ఇక్కడ ఓ ఫంక్షన్ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగిస్తున్నారు. సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అర్ధరాత్రి ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఫంక్షన్‌లో వినియోగిస్తున్న ఢిల్లీకి చెందిన 50 బ్లాక్ లేబులు బాటిళ్లు, గోవాకు చెందిన నాలుగు యివాస్‌రీగల్ బాటిళ్లు, తెలంగాణకు చెందిన 3 లిక్కర్ బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాష్ ఆయిల్ పట్టివేత

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి నుండి రూ.3 లక్షల విలువ చేసే హాష్ ఆయిల్‌ను ఎస్ఎఫ్‌టీఏ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో హాష్ ఆయిల్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి నేతృత్వంలో ఆదివారం దాడులు నిర్వహించి మహదేవపురానికి చెందిన సుభాష్, మల్కాజ్‌గిరికి చెందిన రామచంద్రరాజును అదుపులోకి తీసుకున్నారు. నవీన్‌రాజు అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 300 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఉచ్చులోకి దించి.. మాట మార్చి!

చర్లపల్లి సెంట్రల్ జైలులో షేర్ అలీ కేశ్వానీ

- 2004 నాటి కేసులో 2013లో అరెస్టయిన పాకిస్థానీ
- సరైన సాక్ష్యాధారాలు లేక 2015లో వీగిన కేసు
- తమ దేశీయుడని అంగీకరించని దాయాది దేశం



సాక్షి, సిటీబ్యూరో: ఉగ్రవాదం, గూఢచర్యం, వీరికి సహాయ సహకారాలు అందించడం కోసం పాకిస్థాన్ తన దేశీయుల్ని భారత్‌లోకి పంపిస్తూనే ఉంటుంది. ఎవరైనా ఇక్కడ పట్టుబడితే వారిని తమ దేశీయుడని అంగీకరించడానికి మాత్రం వెనకడుగు వేస్తోంది. కొందరిని మాత్రమే తమ జాతీయులని అంగీకరిస్తూ.. మిగిలిన వారితో తమకు సంబంధం లేనట్లు చేతులు దులుపుకొంటోంది. ఈ కారణంగానే 2004లో నమోదైన కేసులో 2013లో అరెస్టు అయి, 2015లో ఆ కేసు వీగిపోయినా 76 ఏళ్ల వయసున్న పాకిస్థానీ షేర్ అలీ కేశ్వానీ ఇప్పటికీ చర్లపల్లి కేంద్రం కారాగారంలో మగ్గుతున్నాడు.

ఐఎస్ఐ ఆదేశాలతో వచ్చిన అర్షద్...

పాకిస్తాన్‌లోని రహీమ్‌యార్‌ఖాన్ జిల్లా ఖాన్‌పూర్‌కు చెందిన అర్షద్ మహమూద్ అలియాస్ అర్షద్ మాలిక్‌ను 2002 నవంబరులో పాక్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ అధికారులు ఫీర్జీ, లియాఖత్ సంప్రదించారు. మూడు నెలల పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి, భారత ఆర్మీ యూనిట్ల సమాచారం అందించడానికి సిద్ధం చేశారు. అర్షద్‌కు పాకిస్థాన్ పాస్‌పోర్ట్ ఇచ్చి బంగ్లాదేశ్ పంపారు. అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లు అర్షద్ పేరుతో బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ ఇచ్చి 2003 మార్చిలో బెహరామ్‌పూర్ మీదుగా కోల్‌కతా పంపారు. హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని 2003 జూలైలో పాస్‌పోర్ట్ అందుకున్నాడు. దీంతో సిటీకి వచ్చిన అర్షద్ ముత్యాల్‌బాగ్‌లో మకాం ఏర్పాటు చేసుకున్నాడు. చుట్టుపక్కల వారితో తాను వైద్య పరికరాలు అమ్మే చిన్న వ్యాపారినంటూ, కోల్‌కతా నుంచి వచ్చినట్లు చెప్పుకొన్నాడు.

2004లో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు..

నగరంలోని భద్రతా బలగాలకు చెందిన సున్నిత ప్రాంతాల్లో తిరిగి, వివరాలు సేకరించే అర్షద్ మాలిక్ రాత్రి వేళల్లో వాటిని ఐఎస్ఐకి పంపేవాడు. కింగ్‌కోఠి అగర్వాల్ చాంబర్స్‌లో ఉండే హైదరాబాద్ సైబర్ కేఫ్ నుంచి ఈ–మెయిల్స్ ద్వారా షేర్ చేసేవాడు. ఇందుకు ప్రతిఫలంగా పాకిస్థాన్ నుంచి ఫీర్జీ హవాలా ద్వారా ఎప్పటికప్పుడు ఇతనికి సొమ్ము పంపేవాడు. 2004 మార్చి 9న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైబర్ కేఫ్‌లో ఉన్న అర్షద్‌ను పట్టుకున్నారు. ఇతడి నుంచి ఆర్మీ లొకేషన్స్ ఫొటోలు, సికింద్రాబాద్–హైదరాబాద్‌ల్లో ఉన్న ఆర్మీ లొకేషన్స్ స్కెచ్‌లు, ఆర్మీ అధికారుల టెలిఫోన్ డైరెక్టరీలు స్వాధీనం చేసుకున్నారు. తొలుత అబిడ్స్ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుల ఆ తర్వాత సిట్‌కు బదిలీ అయింది.

ఇతడి విచారణలో వెలుగులోకి మాలిక్..



అర్షద్ విచారణ నేపథ్యంలోనే ఇతడికి షేర్ అలీ కేశ్వానీ అనే పాకిస్థానీ సహకరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇతడిని ఉగ్ర ఫైనాన్షియర్‌గా మార్చిన పాకిస్థాన్.. భారత్‌కు పంపింది. ఇక్కడ ఉన్న ఐఎస్ఐ ఏజెంట్లకు ఆర్థిక సాయం చేస్తున్న కేశ్వానీని ఆగ్రా పోలీసులు 2004 జనవరిలోనే అరెస్టు చేశారు. అక్కడ కేసు విచారణ పూర్తికావడం, జైలు శిక్ష సైతం విధించడంతో సుదీర్ఘకాలం సిటీకి తీసుకురాలేకపోయారు. అర్షద్‌కు నాంపల్లి కోర్టు 2009లో జీవితఖైదు విధించింది. కేశ్వానీని నగర పోలీసులు 2013లో ఇక్కడికి తీసుకువచ్చారు. 2015 మార్చి 9న ఇతడిపై ఉన్న కేసు వీగిపోయింది. ఇలాంటి వాళ్ల శిక్షాకాలం పూర్తయినా, కేసు వీగిపోయినా జైలు నుంచి బయటకు పంపాలంటే పాకిస్థాన్ సదరు వ్యక్తి తమ పౌరుడే అని అంగీకరించాలి. అర్షద్ తమ జాతీయుడేనని అంగీకరించడంతో 2017లో అతడిని పాక్‌కు పంపేశారు. కేశ్వానీ విషయంలో ఇలా జరగకపోవడంతో ఇప్పటికీ చర్లపల్లి జైలులోనే ఉన్నాడు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని...

దుండిగల్: చిన్న నాటి స్నేహితురాలిని ప్రేమించి పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, యాపర్ల గ్రామానికి చెందిన తిమ్మరాజు రవి(25) కుటుంబం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి కూకట్‌పల్లి, శంషీగూడలో నివాసముంటోంది. రవి కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో తన స్నేహితురాలు నీలవేణితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రెండేళ్ల క్రితం వారు పెద్దలను ఎదిరించి ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. గత 8 నెలలుగా వారు బౌరంపేటలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. రవి కారు డ్రైవర్‌గా పని చేస్తుండగా నీలవేణి ఇంటి వద్దనే ఉంటుంది. కొద్ది రోజులుగా వీరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ నెల 10న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు మధ్యాహ్నం తన ఇంటికి వచ్చిన తల్లితో కలిసి నీలవేణి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రవి తన తల్లికి ఫోన్ చేసి తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తనకు బతకాలని లేదని చెప్పి విలపించాడు. దీంతో ఇంటికి రావాలని కోరగా ఫోన్ పెట్టేశాడు. ఆదివారం ఉదయం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తల్లి, సోదరుడు బౌరంపేటకు వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


భార్యతో రవి (ఫైల్)

పాత కరెన్సీ మార్పిడీకి యత్నం

- రూ.99 లక్షల నగదు స్వాధీనం
- నలుగురి అరెస్టు.. మరో నలుగురి పరారీ

సనత్‌నగర్: రద్దయిన కరెన్సీ నోట్లను మార్చేందుకు యత్నిస్తున్న నలుగురు వ్యక్తులను బేగంపేట పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.99 లక్షల విలువైన కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ఎస్ఐ జయచందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.టీవోలీ ఎక్స్‌ట్రీమ్ థియేటర్ వద్ద రద్దయిన పాత నోట్ల మార్పిడీకి యత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం మధ్యాహ్నం ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వర్, బుర్రా శివకుమార్, పుట్టపల్లి రవీందర్‌రెడ్డి, గొల్లమందల రవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.99 లక్షల విలువైన రద్దయిన రూ.1000, రూ.500ల కరెన్సీ నోట్లతో పాటు కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 20 శాతం కమీషన్ ప్రాతిపదికన వీరు మరికొందరితో కలిసి పాత నోట్ల మార్పిడికి యత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులను అరెస్టు చేయగా, పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి బలవన్మరణం

సికింద్రాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓల్డ్ అల్వాల్ మంగాపురం కాలనీకి చెందిన పీచర ప్రశాంత్‌కుమార్(48) వృత్తి రీత్యా వ్యాపారి. కొంత కాలంగా అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అతడి తల్లి కేన్సర్‌తో ఇబ్బంది పడుతోంది. దీంతో మనస్తాపానికి లోనైన అతను ఈ నెల 8న గుండ్ల పోచంపల్లి, బొల్లారం రైల్వేస్టేషన్ల మధ్య సిద్ధిపేట, మల్కాజిగిరి ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య వాసంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారులో మంటలు

కాలిపోయిన కారు: తప్పించుకున్న డ్రైవర్



శంషాబాద్ రూరల్: రహదారిపై వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని కారు దగ్ధమైంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... నగరం నుంచి టాటా జెస్ట్ కారు ఆదివారం మధ్యాహ్నం షాద్‌నగర్ వైపు వెళ్తుంది. బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి శివారులో ఉన్న రైల్వే వంతెనపైకి రాగానే కారులో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ హుస్సేన్ వెంటనే కారును నిలిపివేసి కిందకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పాటు ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మంటలకు కారు ఆహుతైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

శామీర్‌పేట్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి లోనైన ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రసూల్‌పుర కు చెందిన కాగితాల సుశీల (60) కూలీ పని చేసి జీవనం సాగిస్తోంది. గత కొంతకాలంగా ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికిలోనైన ఆమె శనివారం ఉదయం పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శామీర్‌పేట పెద్దచెరువు వద్దకు వచ్చింది. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

చిలకలగూడ: ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సబిత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన బూక్యా లింగన్న (26) నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో సేల్స్ సర్వీస్ ప్రొవైడర్‌గా పనిచేస్తూ, భార్య పూజిత, రెండేళ్ల కుమారునితో కలిసి సీతాఫల్‌మండి మేడిబావిలో నివాసం ఉంటున్నాడు. గర్భవతి అయిన అతడి భార్య పూజిత ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. శనివారం ఉదయం నుంచి ఆమె పలుమార్లు ఫోన్ చేసినా లింగన్న లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి అతడి స్నేహితుడు బిక్షుకు ఫోన్ చేసి సమాచారం అందించింది. ఆదివారం సాయంత్రం అతను లింగన్న ఇంటికి వెళ్లి తలుపు కొట్టినా స్పందించలేదు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా లింగన్న సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితమే అతను ఉరి వేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన లింగన్న ఆర్థికంగా నష్టపోయాడని, అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతుని సోదరి నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చాక్లెట్లు దొంగిలించిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: సూపర్‌మార్కెట్‌లో చాక్లెట్లు దొంగిలించిన యువకుడిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలోని కేపీఎస్ సూపర్‌మార్కెట్‌కు గత నెల 28న ఓ వ్యక్తి వచ్చి గుట్టుచప్పుడు కాకుండా దాదాపు రూ.10వేలు విలువ చేసే చాక్లెట్లను కవర్‌లో నింపుకుని బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయాడు. అనంతరం లెక్కల చూసుకున్న మేనేజర్ ఇతర సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తి చాక్లెట్లు దొంగిలించాడని గ్రహించారు. అదే వ్యక్తి ఆదివారం కూడా సూపర్‌మార్కెట్‌కు వచ్చాడు. దాదాపు రూ.3వేల విలువైన చాకెట్లను తీసుకున్నాడు. ఈ క్రమంలో సూపర్‌మార్కెట్‌లో పని చేస్తున్న సిబ్బంది అతడిని గుర్తుపట్టి మేనేజర్‌కు తెలియజేశారు. మేనేజర్ ఉదయ్‌కిరణ్ మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు చేయగా పోలీసులు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌పై అకారణంగా దాడి

ఇద్దరిపై కేసు నమోదు

వెంగళరావునగర్: మద్యం సేవించిన ఇద్దరు ఆటో డ్రైవర్లు అకారణంగా చెత్త తరలించే లారీ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్న చంద్రయ్య శనివారం రాత్రి చెత్త తరలించడానికి యార్డులోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి చంద్రశేఖర్ అనే ఆటో డ్రైవర్ వచ్చి లారీని పక్కకు తీయాలని కేకలు వేశాడు. కొద్దిసేపు ఆగమని చెప్పగా లారీ డ్రైవర్, హెల్పర్లపై గొడవ పడ్డాడు. మద్యం సేవించి ఎందుకు ఆటో నడుపుతున్నావని లారీ డ్రైవర్ ప్రశ్నించగా అతడిపై దాడి చేశాడు. అంతేగాకుండా ఫోన్ చేసి నర్సింహ అనే మరో వ్యక్తిని పిలిపించాడు. అతను కూడా లారీ డ్రైవర్‌పై దాడి చేశాడు. దీంతో లారీ డ్రైవర్ చంద్రయ్యకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాచీ బేకరీపై దాడి

బీజేపీ, బీజేవైఎం నేతలపై కేసు నమోదు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని కరాచీ బేకరీపై శనివారం దాడి చేసిన బీజేపీ నేతలపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... పట్టణంలోని సంగీత మొబైల్స్ పక్కనే ఉన్న కరాచీ బేకరీ పేరును మార్చాలంటూ బీజేవైఎం, బీజేపీ నాయకులు శనివారం బేకరీ ఎదుట ఆందోళన చేపట్టారు. దాయాది దేశంతో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్‌లోని కరాచీ పేరున్న దుకాణాలు మన దేశంలో కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరాచీ బేకరీ పేరును వెంటనే మార్చాలంటూ ఆందోళన చేయడంతోపాటు పేరుతో ఉన్న బోర్డును మార్చేందుకు యత్నించారు. దీనిపై బేకరీ యజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్బందులకు గురిచేసిన పది మంది బీజేపీ నేతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తాండూరులో ఏఎస్‌జీఎంకే ట్రస్టు చైర్మన్ ముజీబ్‌ఖాన్‌తో కలిసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, వైద్య, కంటి శిబిరాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సంపాదించిన దానిలో కొంత మొత్తం పేదలను ఆదుకునేందుకు ఉపయోగించాలన్నారు. తాండూరు ప్రాంతంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ ముజీబ్‌ఖాన్ అభినందనీయుడన్నారు. అనంతరం ముజీబ్‌ఖాన్ మాట్లాడుతూ.. స్వార్థ చింతనను వదిలి పేదలకు ప్రతి ఒక్కరూ తోచిన సహాయ సహకారాలు అందించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం పురుషోత్తం రావు, అబ్దుల్ రవూఫ్, డాక్టర్ సంపత్ కుమార్, రవి, భగవాన్, రఘు, శివానంద్, సంకేత్, తేజ్ అబ్దుల్లా, మసూద్, గఫూర్ పాల్గొన్నారు.

రైతు జితేందరెడ్డిని ఆదుకుంటాం

తాండూరు రూరల్: విద్యుదాఘాతంతో చెరుకు పంట దగ్ధమైన రైతు జితేంధర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పెద్దేముల్ మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. విద్యుదాఘాతంతో దగ్ధమైన జితేందర్‌రెడ్డి చెరుకు పంటను పరిశీలించారు. వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేసి ప్రభుత్వం నుంచి రైతుకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ డీఈ భాను ప్రకాశ్‌ను ఆదేశించారు. అనంతరం పెద్దేముల్ మండల కేంద్రంలోని చిట్టెపు లక్ష్మమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బషీరాబాద్ మండలంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు కరణం పురుషోత్తంరావు, డీవై నర్సింలు, బలవంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అజంఖాన్, సిబ్లి, బుజ్జమ్మ, బాలప్ప, రవీందర్ ఉన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు


ధ్రువపత్రాలతో విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు పది రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. శిక్షణలో భాగంగా విద్యార్థులకు గేమ్స్, స్పోర్ట్స్‌తో పాటు ఖురాన్ పఠనం, నైతిక విలువలు తదితర అంశాలలో తర్ఫీదునిచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు అంజద్ హుస్సేన్, యూనిట్ అధ్యక్షుడు రఫీయొద్దీన్, ఆర్గనైజేషన్ వికారాబాద్ ఇంచార్జి అబ్దుల్ వాసే తదితరులు పాల్గొన్నారు.